## క్లుప్తంగా

### అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే పర్వత



ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

శంఖవరం: రాష్ట్ర శాసన సభ అంచనాల కమిటీ సభ్యుడిగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంచనాల కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌ను శంఖవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు గౌతు నాగు, గౌతు అర్జుబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్రాభివృద్ధి

తుని రూరల్: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమని హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్ అన్నారు. హంసవరం పంచాయతీ ఆవరణలో బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన పనులు గుర్తించి పూర్తి చేయాలన్నారు. అందుకు ప్రజలు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, ఉపాధి హామీ పనులు, ఇతర సమస్యలపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శి ఇ.శంకర్, నాయకులు రాయి పాపారావు, పెదపాటి అరుణ్ కుమార్, బొబ్బరాల వరదరాజులు, సచివాలయ కన్వీనర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత

రౌతులపూడి: ఎస్.అగ్రహారంలోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఎస్. అగ్రహారంలో రేషన్ బియ్యం నిల్వ చేసినట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు రెవెన్యూ, సివిల్ సప్లయిస్ దాడి చేసి 50 కేజీల చొప్పున 42 బ్యాగుల్లో ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.84 వేలు ఉంటుందని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రౌతులపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గ్రామంలోని సంబంధిత రేషన్ డీలర్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో డీటీ టీవీవీ సత్యనారాయణ, వీఆర్వో అరుణ తదితరులు పాల్గొన్నారు.

### దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం

ఏలేశ్వరం: శ్రీదేవి శరన్నవరాత్ర ఉత్సవాలకు పట్టణంలో బుధవారం పందిరి రాట వేసి శ్రీకారం చుట్టారు. స్థానిక లింగవరం కాలనీలో జేవీఆర్ ట్రస్ట్ చైర్మన్ జువ్విన వీర్రాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జువ్విన వీరరాఘవమ్మ దంపతుల ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. ఈ నెల 15 నుంచి 24 వరకూ తొమ్మిది రోజుల పాటు శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, బది రెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



20వ వార్డులో మంచినీటి ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న వైస్ చైర్‌పర్సన్ బుజ్జి

ఏలేశ్వరం: పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి తెలిపారు. స్థానిక 20వ వార్డులో బుధవారం మంచినీటి ట్యాంక్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### బాలల హక్కులపై అవగాహన

గోకవరం: బాలల హక్కులపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. మండలంలోని వీరంకపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలల హక్కులపై, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. భోజనశాల, మరుగుదొడ్లు, డార్మెట్రీని పరిశీలించి విద్యార్థినులకు అందుతున్న వసతులు, సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థినులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.

# ప్రజల చెంతకే వైద్య సేవలు

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- దానవాయిపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష



దానవాయిపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా



కిర్లంపూడిలో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల చెంతకే వైద్యసేవలు అందుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని దానవాయిపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో చారిత్మాత్మక మార్పులు చేశారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, ఎంపీడీఓ పసపులేటి సతీష్, ఈవోపీఆర్డీ ఎస్.సత్య ప్రసాద్, పార్టీ నాయకులు మడదా పరమేశ్వరరావు, మడదా హేమంత్, దడాల విజయ్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, సర్పంచ్ మడదా తిరుమల కుమారి, వైద్యులు పి.రవికుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం**

రౌతులపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని గుమ్మరేగులలో ఎంపీడీఓ ఎం గోవిందు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన హెల్త్ కౌంటర్లను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకెళ్లి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సర్వేలో 265 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 202 మందికి చికిత్సను అందించి ఉచితంగా మందులు అందజేశారు. 57 మందికి కంటి పరీక్షలు చేశారు. కంటి వెలుగులో భాగంగా 52 మందికి కళ్ల జోళ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు రాపర్తి రామకృష్ణ, యెనుముల కోటిబాబు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**జె.అన్నవరంలో..**

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు శ్రీలక్ష్మి, పాపారావు ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.

**ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌నే లక్ష్యం**

తుని రూరల్: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ అన్నారు. టి.తిమ్మాపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్ అత్తి వరలక్ష్మి, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాముతో కలిసి ఆమె ప్రారంభించారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ, ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, ఎంపీడీఓ పి.రవికుమార్ పాల్గొన్నారు.

**ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం**

కిర్లంపూడి/గండేపల్లి: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. కిర్లంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, సర్పంచ్ గుడాల శ్రీలతతో కలిసి ఎమ్మెల్యే చంటిబాబు ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ హెల్త్ కౌంటర్లను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. రోగులకు వైద్య కిట్లలను పంపిణీ చేశారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారన్నారు. పైసా ఖర్చు లేకుండా స్పెషలిస్టు వైద్యులతో వైద్య సేవలు, 7 రకాల ల్యాబ్ పరీక్షలు, 104 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్లు బి.రాంబాబు నాయక్, పి.రవికుమార్, జ్యోతిర్మయి, హెచ్‌సీ 412 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరో 15 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, ఎస్ఎస్ రామ్ కుమార్, బొజ్జపు శ్రీను, అల్లు విజయ్‌కుమార్, ఆళ్ల బాబులు, ఎంపీడీఓ బడే రాజేశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



గుమ్మరేగుల్లో రోగులకు ఆరోగ్య సురక్ష పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్



టి.తిమ్మాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

**ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం**

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గండేపల్లి మండలంలోని యల్లమిల్లిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వైద్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిన్ని వీరబాబు, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, సర్పంచులు నూకతట్టు నాగజ్యోతి, ములంపాక సురేష్, ఉప సర్పంచ్ కోన గంగాధర్, జగ్గంపేట జేసీఎస్ మండల కన్వీనర్ బండారు రాజా, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్**




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామం శంఖవరంలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం నిర్వహణపై వైఎస్సార్ సీపీ నేతలతో బుధవారం ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. అర్హతే ప్రమాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పాలన ప్రజల చెంతకే చేరిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, వైస్ ఎంపీపీ ధారా రమణ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షులు నరాల శ్రీను, జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



బాలుడి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

ఏలేశ్వరం: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్యానికి వివేకానంద సేవా సమితి సభ్యులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. జగ్గంపేట మండలం బూరుగుపూడికి చెందిన పమ్మిరెడ్డి త్రిమూర్తులు, దేవి దంపతుల రెండు నెలల కుమారుడు కార్తిక్ బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. బాలుడి వైద్యానికి రూ.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో స్పందించిన వివేకానంద సేవా సమితి సభ్యులు దాతల ద్వారా రూ.1.27 లక్షలు వసూలు చేసి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్తిక్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మైరాల నాగేశ్వరరావు, మెలిపాక నాగేంద్ర, కె.గోవింద్, ఎస్.వెంకన్న, సూరిబాబు, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 27న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి సుబ్బలక్ష్మి

ప్రత్తిపాడు: ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటనను ఈ నెల 16వ తేదీ నుంచి 27వ తేదీకి వాయిదా వేసినట్టు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల అధికారి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి తెలిపారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని 227 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. మార్పులు చేయాల్సిన పోలింగ్ కేంద్రాల జాబితాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధించి ఆమె వివరణ ఇచ్చారు. సమావేశంలో ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల తహసీల్దార్లు జి.చిన్నారావు, కె.సుబ్రహ్మణ్యం, జి.భీమారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు పాల్గొన్నారు.

## వైద్యరంగంలో సంస్కరణలకు శ్రీకారం

**మాజీ మంత్రి తోట నరసింహం**



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

కిర్లంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. మండలంలోని కృష్ణవరంలో బుధవారం మామిడి కోదండం అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబంలోనూ వెలుగులు వచ్చాయన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తోట బాబ్జీ, తోట రాంజీ, తోట వేణు, బేరి బాబ్జీ, ఓలేటి రాజేశ్వరరావు, రాపేటి శ్రీను, తోట అయ్యన్న, అడబాల సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం



తునిలో పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఏవోలకు సూచనలిస్తున్న సీఐ గీతారామకృష్ణ

తుని: విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ సూచించారు. పట్టణ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఏవోలతో బుధవారం సాయంత్రం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గీతా రామకృష్ణ మాట్లాడుతూ పాఠశాలలోని క్లాస్ రూం, పార్కింగ్, స్కూల్ బయట అన్ని వైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్, కళాశాలలకు పిల్లలు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు వారి కోసం గైడ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు ఆటోల్లో వచ్చే పిల్లలకు సంబంధించి ఏ ఆటో, ఎంత మంది వస్తున్నారు, ఆటో డ్రైవర్ పేరు, ఫోన్, వివరాలు తీసుకోవాలని సూచించారు. స్కూల్స్, కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు సొంతంగా మోటారు సైకిళ్లపై వస్తున్నారని, ఇలాంటి వారి వివరాలను సేకరించి తల్లిదండ్రులకు మోటారు సైకిల్‌పై రావడానికి అనుమతించమని నోటీస్ ద్వారా తెలియపరచాలన్నారు. బస్సులకు ఫిట్‌నెస్, ఇన్సురెన్స్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్, ఏవోలు పాల్గొన్నారు.

### ఈ-క్రాప్ నమోదు గడువు పొడిగింపు



ఈ-క్రాప్ నమోదుపై అధికారులకు సూచలిస్తున్న విజయ్‌కుమార్

తొండంగి: ఈ–క్రాప్ నమోదుకు ప్రభుత్వం గడువును ఈ నెల 8 వరకూ పొడిగించిందని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని శృంగవృక్షం, రావికంపాడు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. రైతులు సాగు చేసిన పంటలు, ఈ–క్రాప్ నమోదు, ఈ–కేవైసీ నమోదు ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు చేయించుకోని రైతుల కోసం ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు, మండల ఏఓ ఎస్.నరసింహం పాల్గొన్నారు.

## సమన్వయంతో ప్రజలకు మేలు చేద్దాం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గండేపల్లిలో మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజలకు మేలు చేద్దామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో సమస్యలను ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. అనంతరం వలంటీర్లతో సమీక్షించారు. ఈ నెల 11 నుంచి నిర్వహించే వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమంపై గృహసారథులు, వలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిన్ని వీరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, వైస్ ఎంపీపీ కుంచె రాజా, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గండేపల్లి సొసైటీ అధ్యక్షుడు కేతిన బాబి, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో 25 లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. కిర్లంపూడి మండలం కృష్ణవరంలో దాడులు నిర్వహించి ఐదు లీటర్ల సారాతో పప్పుశెట్టి గన్నియ్యను అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం నుంచి ధర్మవరం వెళ్లే రహదారిలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన గీసాల సుబ్రహ్మణ్యం మోటారు సైకిల్‌పై 20 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుబడ్డాడు. సుబ్రహ్మణ్యానికి సారా విక్రయించిన పెద్దిపాలెం గ్రామానికి చెందిన బొండలపు రాజుపై పరారీ కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎవరైనా సారా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



హైవేపై ఎర్రకోనేరు వద్ద స్తంభించిన ట్రాఫిక్

తుని రూరల్: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని తేటగుంట శివారు ఎర్రకోనేరు సమీపంలో బుధవారం ట్రాఫిక్ స్తంభించింది. రెండు రోజుల కిందట ఇక్కడ హైవేకి పక్కనే ఉన్న గుంతలో లారీ బోల్తా పడింది. ఆ లారీని పొక్లెయిన్‌తో బయటకు తీస్తుండడంతో ట్రాఫిక్‌ను వన్ వేకు మళ్లించారు. తుని నుంచి అన్నవరం వైపు వెళ్లే వాహనాలు, అన్నవరం నుంచి తుని వైపు వచ్చే వాహనాలు ఒకే మార్గంలో రాకపోకలు చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. హైవే నిర్వాహకులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించకపోవడంతో ఎక్కువ సేపు వాహనాల రాకపోకలకు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### ప్రజా సంక్షేమమే లక్ష్యం

తుని: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో బుధవారం సాయంత్రం కౌన్సిలర్ ఆచంట సురేష్ ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ–మనబాధ్యత కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పరంగా ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయుడు, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్య చక్రరెడ్డి, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, పేరూరి కృష్ణ, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### కట్టడాలకు అనుమతి లేదు

జగ్గంపేట: పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలవ గట్లపై కట్టడాలకు ఎలాంటి అనుమతులు లేవని, పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ఎస్ఈ బి.యేసుబాబు తెలిపారు. జగ్గంపేటలో పోలవరం ఎడమ కాలవ గట్లను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది జిల్లా కలెక్టర్ అనుమతులు ఇచ్చారని చెప్పి నిర్మాణాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది నిజం కాదని తెలిపారు. ఆక్రమణలు చేసిన వారిపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు తమ సిబ్బంది ఫిర్యాదు చేశారన్నారు. ఎవరైనా పోలవరం కాలువ పై కట్టడాలు కడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాజేశ్వరరావు, జగ్గంపేట ఈఈ శ్రీనివాస్, రైతు కూలీ సంఘం నేతలు పాల్గొన్నారు.

### విద్యుత్ స్తంభాలు తొలగించాలని ధర్నా

గోకవరం: ప్రధాన రహదారికి అడ్డంగా వేస్తున్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతూ బీజేపీ, జనసేన పార్టీల నాయకులు బుధవారం గోకవరంలో ధర్నా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి గుడి సెంటర్లో రోడ్డుపై బైఠాయించి సుమారు గంట పాటు నిరసన తెలిపారు. ప్రస్తుతం ప్రధాన రహదారి ఇరుకుగా ఉందని, రహదారిని విస్తరించకపోగా ఒకవైపు అడ్డంగా విద్యుత్ స్తంభాలను వేయడం వలన ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిపై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నిరసనకారులతో మాట్లాడటంతో వారు ఆందోళన విరమించారు. బీజేపీ సీనియర్ నాయకుడు మట్టా మంగరాజు, మండలాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, కార్యదర్శి ఇనకోటి బాపన్నదొర పాల్గొన్నారు.

### ఇద్దరు వీఆర్ఏల సస్పెన్షన్

గోకవరం: అవకతవకలకు పాల్పడిన ఇద్దరు వీఆర్ఏలను సస్పెండ్ చేసినట్టు స్థానిక తహసీల్దార్ డి.సుగుణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డి వీఆర్ఏ కొల్లాటి సుబ్రహ్మణ్యప్రసాద్, మల్లవరం వీఆర్ఏ కుండెల్లి చిన్న తహసీల్దార్ కార్యాలయంలో వెబ్‌ల్యాండ్ ఆపరేటర్లుగా పని చేసేవారన్నారు. వెబ్‌ల్యాండ్‌లో రైతుల భూములకు డిజిటల్ సైన్ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడంతో పాటు మ్యూటేషన్ చేసిన సర్వే నంబర్లు గల భూములకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు జనరేట్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. డిజిటల్ సైన్ దుర్వినియోగం చేసి వెబ్‌ల్యాండ్‌లో మార్పులు, చేర్పులు చేశారన్నారు. దీనిపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రాథమిక విచారణ నిర్వహించి వారిపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. విచారణ పెండింగ్‌లో ఉందని అప్పటి వరకు వీరిని సస్పెండ్ చేశామని వివరించారు.

### ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో ఎరువుల దుకాణంపై బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. గ్రామంలోని రోహిణిశ్రీ ఎరువుల దుకాణంపై దాడి చేసి గడువు దాటిన పురుగు మందులు, స్టాకు రిజిస్టర్‌లో తేడాలు ఉన్నట్టు గుర్తించారు. రూ.2 లక్షల విలువ చేసే నిల్వలను సీజ్ చేశారు. షాపు నిర్వాహకులపై 6ఏ కేసు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.కుమార్, డీఎస్పీ ముత్యాలనాయుడు, ఎస్సై జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.